క్లుప్తంగా

పిల్లల కోసం తల్లి పోరాటం



ఓబులమ్మతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా మైదుకూరు–వనిపెంట రోడ్డులోని విజయనగర కాలనీకి చెందిన అక్కిదాసరి ఓబులమ్మ, భర్త చిట్టిబాబులకు 2008లో వివాహమైంది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే చిట్టిబాబు నాలుగు నెలల కిందట మహిళను వివాహం చేసుకుని కమలాపురం మండలం ఎల్లారెడ్డిపల్లెలో ఉంటున్నాడు. ఈమె ఐదుగురు పిల్లలను తీసుకుని హైదరాబాదుకు వెళ్లింది. అక్కడ ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. బస్టాండు పక్కన ఓ షెల్టర్‌లో తలదాచుకుంటోంది. ఈ విషయం ఓ పత్రికలో వార్త ప్రచురించడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించి ఐసీడీఎస్ అధికారి రమాదేవిని మైదుకూరుకు వెళ్లి ఈ విషయంపై ఆరా తీయాలని సూచించారు. అలాగే ఆమెకు ఉపాధి కల్పించాలని, అలాగే పిల్లలకు తల్లికి వందనం పథకం అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ విషయంగా ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీసీపీఓ సుభాష్ యాదవ్‌కు ఓబులమ్మ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం

కడప ఎడ్యుకేషన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యుడు అబ్దుల్ షేక్ రాయల్ కరిముల్లా ఆధ్వర్యంలో రక్తదాన ప్రచార పోస్టర్లను నగరపాలక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా మహిళలు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మదర్ బాషా, మాజీ కార్పొరేటర్ జమాల్ వలి, కార్పొరేటర్లు అజమతుల్లా ఖాన్, బసవరాజు పాల్గొన్నారు.

ప్రచారంతోనే పర్యాటక ప్రగతి

కడప సెవెన్‌రోడ్స్ : విస్తృత ప్రచారంతో పర్యాటక ప్రదేశాల సందర్శన, అభివృద్ధి జరుగుతుందని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫొటోల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ చుట్టుప్రక్కల ఉన్న పర్యాటక ప్రాంతాలను దర్శించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆ తర్వాత జిల్లాలోని ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. గండికోట వల్ల ప్రపంచ స్థాయిలో జిల్లా సగర్వంగా నిలబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, పర్యాటక ఫొటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు, సభ్యులు డేవిడ్, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, విజయ్‌కుమార్‌బాబు పాల్గొన్నారు.

అండర్–19 జిల్లా బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో అండర్–19 జిల్లా బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక ఉత్సాహంగా సాగింది. ఫిజికల్ డైరెక్టర్ జిలానీబాషా ఆధ్వర్యంలో బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. ఐదుగురు క్రీడాకారుల చొప్పున జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వారంతా శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని పీడీ ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ సుదర్శన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే

బాలికల జట్టు : జి.పూజిత, ఎస్.స్మృతిక, జె.మునిగీతిక, వై.నాగమౌళిక, జికె.సంకీర్తన

స్టాండ్‌బై : వి.పూర్ణిమ, సి.రీనా

బాలుర జట్టు : ఎ.సాయినవనీత్‌దత్త, సి.త్రివిక్రమ్, ఎస్.ఇస్మాయిల్, బి.పవన్‌రెడ్డి, డి.అభినవ్

స్టాండ్‌బై : ఏవి.సాయిసంతోష్, జె.దినేష్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ వాణిశ్రీ, ఏసీడీపీఓ శోభారాణి అన్నారు. కడప నగరం దివ్యాంగుల కాలనీలోని పీహెచ్‌సీలో శనివారం స్వస్థ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సూపర్‌వైజర్ మాబువాన్, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జయశుభకారిణి.. విజయరూపిణి



శ్రీ కాత్యాయనిదేవిగా బాలపోలేరమ్మ



శ్రీ వేంకటేశ్వర అలంకారంలో సత్యదేవుడు



శ్రీ వనదుర్గాదేవిగా కామకోటి కళాంబదేవి



శ్రీ మధురమీనాక్షిదేవిగా నడివీధి గంగమ్మ



భావనారుషి ఆలయంలో శ్రీ వారాహీ దేవిగా



మాడవీధుల్లో విహరిస్తున్న కడప రాయుడు



శ్రీ కాత్యాయనిదేవిగా విజయదుర్గమ్మ



మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను సత్కరిస్తున్న దుర్గాప్రసాద్



అమ్మవారిశాలలో పోటెత్తిన భక్తజనం

కడప సెవెన్‌రోడ్స్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బంగారు ఆభరణాలు, సువాసనలు వెదజల్లే పలు రకాల పుష్పాలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆరు గంటల నుంచే భక్తులతో ఆలయాలు పోటెత్తుతున్నాయి. దేదీప్యమానంగా వెలిగిపోతున్న అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు అభయమివ్వాలని ప్రణమిల్లుతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం కడప నగరంలోని చిన్నబెస్తవీధిలో గల బాల పోలేరమ్మను శ్రీ కాత్యాయనిదేవిగా అలంకరించారు. గడ్డిబజారు శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామికి శ్రీ వేంకటేశ్వర అలంకారం (గరుడ సేవ) నిర్వహించారు. కామకోటి కళాంబదేవిని శ్రీ వనదుర్గాదేవిగా తీర్చిదిద్దారు. శ్రీ విజయదుర్గ ఆలయంలో శ్రీ కాత్యాయనిదేవిగా అలంకరించారు. శ్రీ లలితాంబిక అమ్మవారిని శ్రీ అరుణ సరస్వతీదేవిగా, నడివీధి గంగమ్మను శ్రీ మధురమీనాక్షిదేవిగా తీర్చిదిద్దారు. భావనారుషి ఆలయంలో అమ్మవారిని శ్రీ వారాహీ దేవిగా అలంకరించారు. అమ్మవారిశాలలో శ్రీ కన్యకాంబను శ్రీ త్రిపురసుందరీదేవిగా కొలువుదీర్చారు. దేవునికడపలోని కడప రాయుడిని ముత్యపు పందిరి వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. వైఎస్సార్‌కాలనీ అంకాలమ్మ ఆలయంలో లలిత త్రిపురసుందరిదేవిగా, శంకరాపురంలో శ్రీ విజయదుర్గ అమ్మవారిని శ్రీ వారాహీదేవిగా అలంకరించారు. అలాగే నాగరాజుపేటలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి, నబీకోటలోని శివాలయం, ఎర్రముక్కపల్లె, రాజారెడ్డివీధి తదితర ప్రాంతాల్లోని శివాలయాలు, చౌడేశ్వరీమాత, గంగామాత దేవాలయాలలో కూడా అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

అమ్మవారి సన్నిధిలో మాజీ డిప్యూటీ సీఎం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా శనివారం సాయంత్రం శ్రీ విజయదుర్గ ఆలయాన్ని దర్శించుకున్నారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ అంజద్‌బాషాను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు ‘జాషువా’ రచనలపై సదస్సు

కడప ఎడ్యుకేషన్ : విశ్వనరుడు గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కడప జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో జాషువా రచించిన గబ్బిలం, పిరదౌసి, స్వప్న కథ, ముంతాజ్ మహల్ అనే కావ్యాలపై వ్యక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మారుతీ నగర్‌లో జిల్లా కోర్టు నుంచి నాగార్జున స్కూల్ మీదుగా రాజీవ్ పార్కు వరకూ సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని శనివారం ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గుంతలు పడి, రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌తో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఈ వీధిలో మాజీ మేయర్ కె. సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాల సహకారంతో రూ.10లక్షల జనరల్ ఫండ్ నిధులతో సీసీ రోడ్డు మంజూరు చేయించామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని 14 డివిజన్ కార్పొరేటర్ కె.బాబు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కడప నగర అభివృద్ధి, డివిజన్‌లో వారీగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడానికి డివిజన్ యాత్రలు చేపట్టాలని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో కడప నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, టీడీపీ నాయకులు అభివృద్ధి చేయలేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు డివిజన్ యాత్రలు చేయాలని కోరారు.

విద్యార్థులకు కౌశల్ సైన్సు క్విజ్ పోటీలు



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : కౌశల్–2025 పేరిట విద్యార్థులకు నిర్వహించే సైన్సు క్విజ్ పోటీలకు పిల్లలను సిద్ధం చేయాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం కడప డీఈఓ కార్యాలయంలో కౌశల్ జిల్లా కోర్డినేటర్ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సైన్సు అధికారి వేపరాల ఎబినేజర్, సైన్సు ఉపాధ్యాయులతో కలిసి ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని విద్యార్థులకు కౌశల్ 2025 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు త్వరలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు, రీల్స్ తయారీ సంబంధించిన పోటీలు జరుగుతాయని చెప్పారు. 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ కేవీ విజయమోహన్‌రెడ్డి, జిల్లా సైన్సు మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, ఉపాధ్యాయ సంఘ నాయకులు గునిశెట్టి శ్రీనివాసులు, మాజీ జిల్లా సైన్సు ఆఫీసర్ నిత్యానందరెడ్డి, ఉపాధ్యాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

చిరంజీవికి క్షమాపణ చెప్పాలి

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హీరో చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో చిరంజీవితో పోటీపడలేక అక్కసు వెళ్లగక్కుతూ బాలకృష్ణ శాసనసభకు మచ్చతెచ్చారన్నారు. ఎన్‌టీఆర్ కడుపున బాలకృష్ణ చెడబుట్టాడని, ఓజీ సినిమా బెనిఫిట్ షోకు రూ.1,000 టికెట్ పెంచిన నేపథ్యంలో ఆ అక్కసుతోనే మాట్లాడారని ఆరోపించారు. బాలకృష్ణ మానసిక రోగిలా ప్రవర్తిస్తున్నారని, నీచ పదజాలం వాడుతున్న ఆయనకు మతి భ్రమించినట్లుగా ఉందని మండిపడ్డారు.

శిల్పారామంలో దసరా ఉత్సవాలు



మాట్లాడుతున్న శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్

కడప సెవెన్‌రోడ్స్ : దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కడప శిల్పారామంలో ఈనెల 28, 30, అక్టోబరు 2వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక స్టేట్‌గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ప్రముఖ కళాకారులు, టీవీ యాంకర్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.00 నుంచి రాత్రి 8.00 గంటల వరకు, అలాగే ఆదివారం ఉదయం 10.00 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శిల్పారామం తెరిచే ఉంటుందన్నారు. శిల్పారామంలో ఫొటోషూట్ కోసం వచ్చే వారికి ఉదయం 6.00 నుంచి ప్రవేశ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు చేతి వృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, పిల్లలను ఆకట్టుకునే అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో శిల్పారామం అసిస్టెంట్ ఇంజినీరు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రయాణీకులకు తప్పని పాట్లు



ఆర్టీసీ బస్టాండులో సీటు కోసం ఎగుబడుతున్న ప్రయాణీకులు



బస్సుల కోసం ప్లాట్‌ఫారంపై ఎదురుచూస్తున్న ప్రజలు

- బస్సులు లేక అగచాట్లు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరాశరన్నవ రాత్రులను పురస్కరించుకుని ఇప్పటికే పలు విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వగా, శనివారం నుంచి ఇంటర్మీడియట్, బీటెక్, ఇతర విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఈ కారణంగా జిల్లాతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఒక్కసారిగా బస్టాండుకు చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచి ఆర్టీసీ బస్టాండు ప్రయాణీకులతో కిటకిటలాడింది. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండులోకి వచ్చిన అరకొర బస్సుల్లో సీట్ల కోసం వారు ఫీట్లు చేయాల్సి వచ్చింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు కడప డిపో ఇన్‌చార్జి మేనేజర్ జనార్దన్, అధికారులు కృషి చేశారు. ఆర్టీసీ అధికారులు రవాణా విషయంగా సరైన చర్యలు చేపట్టలేదని పలువురు ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మెడికల్ కళాశాలల్లో సీట్లు పెంచాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లు పెంచి పేద, ప్రతిభగల విద్యార్థులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. శనివారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ చదవాలనుకుంటున్న విద్యార్థులు తగినన్ని సీట్లు లేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళాశాలలో తగినన్ని సీట్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మాధవి, రెహమాన్, గణేష్, తారకేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కొరకు కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఈ నెల 26వ తేదీ నుంచి రెండవ విడత అడ్మిషన్ల కొరకు రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కడప ఆర్ట్స్ కళాశాలలో స్పెషల్ తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్సు, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ ఉర్దూ బి.కాం, జనరల్, బి.కాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బి.కాం, బి.ఎఫ్.ఎస్.ఐ, బి.ఎస్.సి లో– గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, జియాలజీ, కంప్యూటర్ సైన్సు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, స్టాటిస్టిక్స్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోరారు. కళాశాలల ఎంపికకు రెండవ విడత వెబ్ ఆప్షన్ల నమోదు సెప్టెంబర్ 29 తేదీన మొదలవుతుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పరిసరాలను పరిశుభ్రం చేసిన ఏఎఫ్‌యూ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు షేక్ షకీల బేగం, గోవిందరెడ్డి కోరారు. శనివారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో..

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితోనే స్వచ్ఛత సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం మొండి వైఖరి వీడి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథరెడ్డి కోరారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేపడుతున్న ధర్నాను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండీ ఇలియాస్ బాషా అధ్యక్షతన శనివారం కడపలోని వీవీఆర్ ఎస్టీయూ భవన్‌లో ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా, కార్యవర్గసభ్యులు పి.మహేష్ బాబు, కె.బాలగంగి రెడ్డి, నరసింహులు, షేక్ సాజిత్, బి.శివశంకర్ రెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, జి.రామ్మోహన్, ఎల్.గంగిరెడ్డి, సురేంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వేతానాలు చెల్లించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు 2023 సంవత్సరంలో 8 నెలల వేతనాలు 2025 సంవత్సరంలో నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు అందక ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే ఖాకీ యూనిఫామ్

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ షెల్కేనచికేత్ విశ్వనాథ్

కడప కార్పొరేషన్ : ప్రజల సేవ, రక్షణ కోసమే ఖాకీ యూనిఫామ్ ఉందని కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో పోలీస్ శాఖ, మెప్మా ఆధ్వర్యంలో మహిళల భద్రత–డ్రగ్స్ నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల వేధింపుపై పోలీస్ శాఖ సీరియస్‌గా దృష్టి పెట్టిందన్నారు. తాను ఎల్లప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, మహిళలు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయిపై గట్టి చర్యలు చేపట్టామని, వాటి సమాచారం తెలిస్తే మహిళలు టోల్ ఫ్రీ నెంబర్ 1972, వాట్సాప్ నెంబర్ 8977781972లకు తెలియచేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అనంతరం ‘డ్రగ్స్ వద్దు బ్రో’ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ బి.రమాదేవి, సుభాష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితానికి దోహదపడే పోస్టులు పెట్టండి

ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ అన్నారు. సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సామాజిక మాధ్యమాలు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 50 మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు...కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికలు, న్యాయ వ్యవస్థ, వ్యక్తిగత దూషణ, కుల, మతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటికి గుర్తిస్తే kadapasocialmedia@gmail. com ji xelw, వాట్సాప్ నెంబర్ 9121100686కు గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎ.మధుమల్లేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మేయర్‌కు అవమానం



మేయర్ చాంబర్‌లో మేయర్ ముంతాజ్ బేగం

కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల మహిళల భద్రత–డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ మహిళా మేయర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ముంతాజ్‌బేగం తన ఛాంబర్‌లో ఉన్నా ఈ ప్రభుత్వ కార్యక్రమానికి ఆహ్వానం పంపలేదు. మహిళల భద్రత అంశంపై జరుగుతున్న సదస్సుకు పిలువక పోవడం కూటమి ప్రభుత్వం తీరుకు అద్దం పడుతోంది. ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అంటూ పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

భక్తి శ్రద్ధలతో జష్న్–యే–నాతియ మెహఫిల్





నాతియా మెహఫిల్‌లో షాయిర్లు, కార్యక్రమంలో పాల్గొన్న జనం

కడప సెవెన్‌రోడ్స్ : మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి నగరంలోని గుంత బజారు మసీదు వద్ద నగర ముస్లిం ప్రముఖులు సుబాన్‌బాషా, సుల్తాన్ బాబాల ఆధ్వర్యంలో నిర్వహించిన జష్న్–యే–నాతియ మెహఫిల్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. తొలుత పలువురు మత గురువులు మహమ్మద్ ప్రవక్త జీవన విధానం, గొప్ప వ్యక్తిత్వం గురించి తెలియజేశారు. బెంగళూరుకు చెందిన హజరత్ నబీల్ భక్తియార్, జైపూర్‌కు చెందిన హజరత్ ఇమ్రాన్ భక్తియార్, ఢిల్లీకి చెందిన హజరత్ ఫర్హన్ భక్తియార్, హైదరాబాదుకు చెందిన షాజ్ అర్ఫిలు తమ నాత్ గేయాలతో విశేషంగా ఆకట్టుకున్నారు. మత గురువులు, ముస్లింలు, భక్తులు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతికి కారకులను అరెస్టు చేయాలి

కడప రూరల్ : బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. భూమిరెడ్డి సుబ్బిరెడ్డిని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత లెక్కల రమణారెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. రమణారెడ్డి తీరుతో ఆందోళన చెందిన సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడి నెలన్నర రోజులు దాటినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని విమర్శించారు.